# తేలుకుట్టిన దొంగ

## కప్పగంతుల మల్లికార్జునరావు

**ఇన్‌స్పెక్టర్ రవిరాజ్ సమాజంలో జరుగుతున్న రకరకాల అరాచకాలను చూచి వాటిని తన శక్తి మేరకు అరికట్టాలన్న దృఢ సంకల్పంతో పోలీస్ డిపార్ట్‌మెంటులో చేరినవాడు. అతనికి పొగడ్తలు పట్టవు. విమర్శల్ని లెక్క చేయడు.**

పగలు పదిన్నర

డిశంబరు నెల కావటంచేత సూర్యుడంతటివాడు చలికి తలవంచక తప్పలేదు. ఎండ చల్లగా హాయిగా వుంది.

అంతవరకూ వేడి వేడిగా హడావుడిగా వున్న ఆ జంక్షన్‌లో రద్దీ తగ్గి కాస్తంత చల్లబడింది.

అటు పురుషుల కాలేజీ— ఇటు స్త్రీల కళాశాల.

తొమ్మిది గంటలనుంచి పదిన్నర వరకు ఆ జంక్షన్ వాహనాలకే కాక యువతీయువకులకు, ప్రేమ జంటలక్కూడా కూడలే.

"ఒరేయ్ ప్రభూ చిలకలన్నీ పంజరం చేరెయిగదా? ఇక క్లాస్‌కెళ్దాం. ఫస్ట్‌పిరియడ్ అటెండన్సు ఇంపార్టెంట్ కదా" టీ కప్పు ఖాళీ చేసి అన్నాడు ఆదెయ్య ఉరఫ్ బి.వై.ఆద్.

ప్రభు మాట్లాడలేదు. ఒక చేతితో టీ కప్పు, మరో చేతిలో గోల్డ్ లీఫ్ సిగరెట్టు... అతని దృష్టి రోడ్డుమీద వుంది.

"మన ఆదిగాడికి అటెండన్సు పిచ్చి తప్ప టైం టేబుల్ కూడా తెలియదురా ప్రభూ..." ప్రభుకు ముందున్న సిగరెట్టు పేకెట్ తీసి తనూ ఒక సిగరెట్టు వెలిగిస్తూ ఎగతాళిగా అన్నాడు ఫ్రెడరిక్

"అవునవును. మనకు ఈసరికి అటెండన్సు పడేవుంటుంది. ఫస్టుపిరియడ్ మనకు ధర్మరాజుకదా?" రెడ్డి ఫ్రెడరిక్‌ను సపోర్టు చేస్తూ అన్నాడు.

ఆ గ్రూప్‌కు ప్రభు నాయకుడు. రెడ్డి ఫ్రెడరిక్ ఆద్‌లు సభ్యులు. చదువు మీద శ్రద్ధ లేకపోవటం, క్లాసులు ఎగగొట్టడం, కనిపించిన అమ్మాయిలను ఏడిపించటం నలుగురికీ హాబీ.

ఫ్రెడరిక్, ఆదెయ్యలు ఒకే గ్రామంనుంచి వచ్చి హాస్టల్‌లో వుండి చదువుకొంటున్నారు. ఇద్దరూ స్కాలర్‌షిప్ హోల్డర్లు. ఆ స్కాలర్‌షిప్పులు కొనసాగాలంటే అటెండన్సు ముఖ్యం. ఇద్దరికీ ఎన్నెన్నో ఆశలున్నాయి. కానీ శక్తి సామర్థ్యాలు మాత్రం పూజ్యం. గ్రూప్‌లో హీరోలు. ఒంటరిగా భీరువులు.

ప్రభు, రెడ్డిలు అలాకాదు.

రెడ్డి మంచి మాటకారి, ఒకవిషయంలో ముందుకు ఎంత వేగంగా దూసుకుపోగలడో అంత వేగంగా వెనక్కి తిరిగి వెళ్లగలడు. దేన్నీ పెద్ద సీరియస్‌గా తీసుకోడు. బుర్రవున్నమనిషి.

ప్రభుకు మాటలపట్ల విశ్వాసంలేదు. అతనికి డబ్బువుంది. అతని తండ్రికి పవర్ కూడా వుంది. కనుక సహజంగానే అతనికి అహంకారం వుంది. డబ్బుతో, పవర్‌తో దేన్నయిన తను సాధించగలనన్న గర్వం, విశ్వాసం వున్నాయి.

కాలేజీ చదువులాంఛనం అతనికి. అమ్మాయిల వేటకి సాధనం లైఫ్ టు ఎన్‌జాయ్! అతని ఎన్‌జాయ్‌మెంటు పలురకాలు.

"ప్రభు ఏమిటో ఈ రోజు సీరియస్‌గా వున్నాడు ఏంటికథ?" రెడ్డి అన్నాడు.

స్నేహితుల గ్రూపులోనే కాకుండా ప్రభు స్వంతంగా కూడా అమ్మాయిలతో వ్యవహారాలు సాగిస్తుంటాడు. నిన్న ఎవరో అమ్మాయి అతడిని ఎర్రగా చూచి ఇన్‌సల్ట్ చేసింది. ఈ రోజు ఆ అమ్మాయి కాలేజికి వెళ్తుంటే అల్లరి చేయాలనుకొన్నాడు. ఆ అమ్మాయి కాలేజీకి వెళ్లలేదివాళ. అంచేత పగతో ప్రతీకారవాంఛతో ఏదో చెయ్యాలన్న తపనతో అతని హృదయం మండుతోంది.

"కథ వుందిరా రెడ్డీ చెప్తాను. ఇవాళ మనం కాలేజీకి 'డుమ్మా' కొట్టేస్తున్నాం".

"కాదీ సెకండ్ అవర్ 'చిచ్చుబుడ్డి' గాడిది క్లాస్‌కు వెళ్లకపోతే అటెండన్సు గోవిందా" ఆదెయ్య అన్నాడు.

'మన నాయకుడు ప్రభు కథలో ఇరుక్కొంటే ఇంకాబోడి అటెండెన్సేమిటోయ్. చిచ్చుబుడ్డి కాని, పిరాబుడ్డికాని క్లాస్కు వెళ్లేది లేదు. నువ్వు కథ చెప్పరా పదినిముషాల్లో కథ చెప్పేదు ప్రభు

సిగరెట్లుపైన సిగరెట్లు తగలబడిపోయాయి.

"అయితే ఇప్పుడు ఏం చేద్దామంటావ్?"

'పయనమయే ప్రియతమ, నను మరచిపోకుమా' టీ కొట్టువాడు ఎప్పటిదో పాత రికార్డును విన్పిస్తున్నాడు.

"ఎప్పుడూ ఆ పాతవేమిట్రా కొట్టువాడివి రికార్డు మార్చుమను" ప్రభు అలా ఆజ్ఞాపించి రోడ్డువైపు చూచాడు.

రోడ్డుమీద ఒంటరిగా ఓ సీతాకోకచిలుక!

"అరె లేవండిరా వూరికి కొత్తపిట్టలాగుంది. మర్యాదగా మనం చెప్పినట్లు వింటా సరి లేకపోతే..."

ప్రభు హుషారుగా లేచాడు. అతడిని అనుసరించారు మిగతా ముగ్గురూ!

* * *

ఒక యువతి—

ఆమె వెనుక నలుగురు యువకులు—

ఈవ్ టీజింగ్! ఇలాంటి దృశ్యాలు రవిరాజ్‌కు కొత్తేంకాదు అందునా ఆ ప్రదేశంలో కానీ సమయంకాని సమయంలో అలాంటి దృశ్యం తటస్థపడటం ఆశ్చర్యమే!

"జీపు ఆపు"

పోలీస్ జీప్ ఆగింది. జీప్‌లో వున్న రవిరాజ్‌కు ఆ దృశ్యం కన్పిస్తుంది. వాళ్లమాటలు విన్పించవచ్చు కానీ జీపు మాత్రం వాళ్లకి కన్పించే అవకాశం లేని చోట వుంది.

"మిస్... మిస్... యూ ఆర్ బ్యూటిఫుల్ ఊరికి కొత్తలా వుందే! ఏ ఊరు మిస్...?" రెడ్డి ఏకంగా ఆమె పక్కకు వచ్చి పలుకరించాడు.

దేవకి ఉలిక్కిపడింది. ఎంత సాహసం? ఏమి చొరవ?

డిగ్రీ చదివే రోజుల్లో ఆమెకు ఇలాంటి అనుభవాలు కొత్తేంకాదు. కానీ తానిప్పుడు విద్యార్థినిలావుందా? లేదే తాను వివాహిత గృహిణి, వివాహితలను కూడా టీజ్ చేసే కాలం వచ్చిందా?

"ఊరికి కొత్తే మిస్టర్. నేను మా శ్రీవారు హనీమూన్ ట్రిప్ ముగించుకొని తిరిగి వెళ్తూ నేను మా అక్కయ్యను చూచిపోదామని వచ్చాను ఇక్కడ ఓ స్నేహితురాలు వుంటే ఆమెను చూచి ఇంటికివెళ్తున్నాను. మా ఇల్లు ఇక్కడికి దగ్గరే చెప్పాలనుకొందామె కానీ భయం వల్ల గుండె తడబడింది.

"బ్యూటీ నాకు చర్చలు సంప్రదింపులు ఇత్యాది మీద విశ్వాసం లేదు. నాక్కావాల్సిదేదో సూటిగా అడిగేసి పొందటం నాకిష్టం. నేను నిన్ను ప్రేమించాను బ్యూటీ, పెళ్లి—గిల్లి అన్నా ఆలోచిస్తానని హామీ ఇస్తున్నాను. కానీ నాకు నీ నుంచి అర్జంటుగా ఓ అద్దాన్ను కావాలి.

డబ్బునుకొని భయపడొద్దు. వెధవ డబ్బు మన దగ్గర చాలా వుంది. సింపుల్‌గా ఓ కిస్ అనగా స్వీట్ ముద్దు ఇవ్వుచాలు. ఇప్పుడు... ఇక్కడ అర్జంటుగా కావాలి. కాదంటే నాకు కోపం వస్తుందని ఋర్తుంచుకో.

ఆమె ముందుకు నడుస్తోంది. జనం మెల్లగా మూగసాగారు.

ఒక్కక్షణం ప్రభుకు లోకం తల్లక్రిందులయినట్లు కన్పించింది. అంతలోనే అవమానంతో రక్తం ఉడికింది. కోపంతో ఊగిపోయాడు.

"ఏయ్, ఎక్కడికే నువ్వు వెళ్లేది. ఆగు నన్ను అవమానించి ప్రాణంతో వెళ్దామనే..? ఏన్నేం చేస్తావో చూడు."

ప్రభు జేబులో నుంచి కత్తి తీసి ఆమెవైపు పరుగెత్తుతున్నాడు.



దేవకికి వెన్నెముక అదిరింది వీడెవడో పెద్ద సినిమా విలన్‌లా గున్నాఢు. ఆమెకేం చేయాలో తోచలేదు అనుకోకుండానే మెళ్లో మంగళసూత్రాన్ని తడుముకొంది. పైట పైన్న వేసుకుంది.

"పెళ్లయిందని చెప్తోందిరోయ్ పిల్ల!" ఫ్రెడరిక్ అన్నాడు.

"పెళ్లయితే రేటు పెరుగుతుందా? తరుగుతుందా?" ఆదెయ్య అసహ్యంగా నవ్వుతూ అన్నాడు.

"నా ప్రశ్నలకు సమాధానం ఇవ్వకపోతే నాకు కోపం వ

వస్తుంది. మూగ మొద్దులంటే నాకసహ్యం పెళ్లికూడా అయినట్లులుందిగా? ఇంకేం? అనుభవజ్ఞురాలివే ఏమంటావ్?' అలా అంటూ ప్రభు ఆమె చేయి పట్టుకొన్నాడు.

ఆ స్పర్శతో దేవకిని ఆవహించిన పిరికితనం పారిపోయింది. కోపం, తెగింపు వచ్చాయి. చెయ్యి విదిలించుకొని ప్రభుని లాగి చెంప దెబ్బ కొట్టింది.

"ఆడదంటే అంతలోకువగా వుందేం నీకు? ఇదేం నాగరిక లోకమనుకొన్నావా? శ్మశానభూమి అనుకొన్నావా? దెయ్యాలు, భూత ప్రేతాలు కూడా నీకన్నా నయం ఛీ..."

"గురూ. పోలీసులు... వాడు... యముడు... రవిరాజ్.. పరుగెత్తు గురూ. పారిపో.." పోలీస్ జీప్ తమ వైపు రావటం చూసి మిగతా ముగ్గురు మిత్రులు తలావొకవైపు పరుగెత్తేరు. ఆ కంగారులో ఆదెయ్య పోలీస్ జీపు కు ఎదురుగ్గా వెళ్ళి చిక్కిపోయాడు.

ఈలోగా ప్రభు వెళ్లి దేవకి జడను పట్టుకొని లాగేడు. "కురులు చాలా అందంగా వున్నాయే దయ్యమా... ఇంత అందం నీకు వికారంగా వుంది." అంటూ ఆ జడను కత్తిపెట్టి మొదట్లోకి కోసేసేడు.

"అరెరె.. ఆడకూతుర్ని.. పట్టపగలు.. అన్యాయం..."

జనం అరుస్తున్నారు. కానీ అతని దగ్గరికెళ్ళటానికి భయపడ్తున్నారు. అతని చేతిలో కత్తివుంది మరి! తాగికూడా వున్నాడేమో!

దేవకి అసహాయంగా ఏడుస్తూ పరుగెత్తసాగింది.

ఆమె వెనుక పరుగెత్తి మళ్ళీ కత్తిఎత్తేడు ప్రభు

ఒక్కక్షణం! కత్తి ఆమె శరీరంలోకి దిగుతుంది

ఇంతలో ఎత్తిన చెయ్యి ఎత్తినట్లే వుండిపోయింది.

అతని చేతిలో నుంచి కత్తి జారికిందపడింది.

"జీపెక్కు.." రవిరాజ్ అతని చెయ్యి మెలితిప్పుతూ అన్నాడు.

"దాన్నికూడా ఎక్కించండి"

మెలితిప్పివున్న చేతిని అలాగే పట్టుకుని మోకాలుతో నడుంమీద ఒక్కపోటు పొడిచాడు రవిరాజ్

"ఆడపిల్లను గౌరవించటం నేర్చుకోరా రాస్కెల్"

* * *

పరుగెత్తుతూ పరుగెత్తుతూ మధ్యలో ఆగివెనక్కి చూచాడు రెడ్డి. ఆదెయ్య జీపులో వున్నాడు. ప్రభు చేతిని రవిరాజ్ పట్టుకొన్నాడు. అంటే ప్రభుకూడా పోలీసులకి చిక్కినట్లే

అతని బుర్ర చురుగ్గా పనిచేసింది.

రవిరాజ్ తనని చూచాడు. వదుల్తాడా? ఎక్కడికి పారిపోయినా గాలం వేసి పట్టుకొంటాడు. తనకు ఇప్పుడు రక్ష కాలేజీ.

అతను కాలేజీ చేరేసరికి మొదటి అవర్ అయిపోయి రెండో అవర్ ఆరంభం కాబోతోంది.

"ఒరేయ్ ఫస్ట్ అవర్ నాకు అటెండెన్సు పడిందా?"

"ఆ ధర్మరాజు అవరేగా? నీకూ, ప్రభు, ఫ్రెడరిక్, ఆదెయ్యలక్కూడా ప్రాక్సీలు పలికాం..."

"గుడ్ ప్రభును ఆదెయ్యను పోలీసులు పట్టుకొన్నార్రా. కొట్టి పోలీస్ స్టేషనుకు తీసుకెళ్లారు."

దావానలంలా ఆ వార్త కాలేజీలో కుర్రాళ్లందరికీ వ్యాపించింది. నాయకులంతా సమావేశమై చర్చలు జరిపేరు.

అరెస్టయిన వ్యక్తి ప్రభు. అంటే ధనవంతుడు పలుకుబడి గలవాడు. ఆ మధ్య ఆర్టీసీ వాళ్లతో విద్యార్థులకు తగాదా వస్తే పోలీసులు ఆర్టీసి వాళ్లను సపోర్ట్ చేసి విద్యార్థుల్ని దండించారు. పోలీసులకు విద్యార్థుల శక్తేమిటో చూపటానికి ఇది మంచి అవకాశం కాదూ? అందునా ఆ రవిరాజ్ ఈవ్‌టీజింగ్ అంటూ కుర్రాళ్లను వేటాడుతున్నాడు.

"మరో అరగంటలో క్లాసెస్ బాయ్‌కాట్" అన్నారు. విద్యార్థులు ఎవరిదోవనవారు ఇళ్లకు వెళ్లే వీల్లేకుండా సైకిల్‌స్టాండు నుంచి సాయంకాలం దాకా సైకిళ్లు ఇవ్వకుండా కట్టడి చేసేరు.

"క్రామేడ్స్... పోలీస్, జులుం నశించాలి. మన విద్యార్థి సోదరులను విడుదల చేయించిందాకా మనం విశ్రమించం. ఛలో ఎస్‌పి బంగళా అండ్ టౌన్ పోలీస్‌స్టేషన్".

కాలేజీ ప్రిన్సిపాల్‌కి ఈ గొడవంతా దేనికో అర్థంకాలేదు. విద్యార్థి నాయకులని పిలిపించాడు.

"పోలీసుల జులుం మరీ పెరిగిపోతున్నది సార్. కాలేజీ విద్యార్థుల్ని కొడ్తున్నారు. నిర్బంధిస్తున్నారు. ఇది అన్యాయం"

"బయట విద్యార్థులకి మరెవరికో ఘర్షణ జరిగితే దాంతో కాలేజీకి సంబంధం లేదనుకోండి అయినా నేను ఎస్‌పి గారితో మాట్లాడుతాను. మీరు క్లాసులకి వెళ్లండి."

"ఇద్దరు విద్యార్థుల్ని నిర్బంధించారు. వారిని విడుదల చేయించండి. క్లాసులో కొస్తాం లేకపోతే రేపటి నుంచి జనరల్ స్ట్రయిక్" బెగిరించిపోయారు విద్యార్థులు

ఎస్పీ డైరెక్టు ఐపీయస్ రిక్రూట్. పంజాబీ యువకుడు. కొత్తగా ఉద్యోగంలో చేరేడు. విద్యార్థులు చెప్పిందంతా విన్నాడు. వాళ్ళ కథనంలో ఏదో లోపం ఉందనిపించింది. ఇన్‌స్పెక్టర్ రవిరాజ్‌కే ఫోన్ చేశాడు. అతని కథనం విన్నాక అతనికి అసలు విషయం అర్థం అయింది. తప్పు విద్యార్థులదే. అయినా పోలీసులనే నిందిస్తారు.

మిస్టర్ ఎస్‌పీ మీ పోలీసులు మా కాలేజీ విద్యార్థులు ఇద్దర్ని నిర్బంధించారుట. స్టూడెంట్సు క్లాసులు బాయ్‌కాట్ చేసారు.

ఇళ్లకుపోకుండా కాలేజీలో వున్నారు. గొడవలు జరుగుతాయేమోనని నాకు అనుమానంగా వుంది. వాళ్లను వదిలెయ్యమనకూడదూ?

"ఏదో కుర్రాళ్లు..తప్పు చేశారనుకోండి."

"వాళ్లు చేసిన తప్పేమిటో మీరు తెల్సుకొన్నారాసార్!"

"వాళ్లు చెప్పటం..." అంటూ విద్యార్థులు చెప్పింది చెప్పాడు ప్రిన్సిపాల్.

'అది రాంగ్ వర్షన్ సార్. వో ఆడపిల్ల జడ. కత్తిరించేసేడు మీ విద్యార్థి. నడి బజార్లో ఆమె మీదికి కత్తి ఎత్తేడు. ఆ 'అమ్మాయి నా సోదరి కావచ్చు. మీ కూతురే కావచ్చు. ఎలా సార్? అన్యాయం జరుగుతుంటే వుదాసీనం వహించటం మంచితనం అనిపించుకొంటుందా సార్! చేతకానితనం అనిపించుకుంటుంది. పోలీసులు చేతకాని చవటలయితే మనదేశం ఏం బాగుపడ్తుంది సార్! కావాలంటే వాళ్ళను మీ పూచీమీద విడుదల చేయమంటాను!'

'వద్దు వద్దు. ఆ కుర్రాళ్ళెవరో ఏమిటో నన్ను విచారించనివ్వండి.'

ఎ ఎస్పీ నవ్వుకొని రవిరాజ్‌కి ఫోన్ చేశాడు.

'మిస్టర్ రాజ్ మీరా కుర్రాళ్ళను ఏం చెయ్యాలనుకొంటున్నారు! కేసుపెడ్తారా!'

'డిజర్వింగ్ కేస్ సర్. కానీ అసలు ఆ అమ్మాయి కాని, వాళ్ళ తాలూకువాళ్లు కాని కంప్లయింట్ ఇవ్వాలికదా! ఆ అమ్మాయి జడ వుంది. కానీ ఆ అమ్మాయి అడ్రస్ లేదు. ఆచూకీ తియ్యమని పంపించాను'

'పన్నెండు గంటలకల్లా అటో ఇటో తేల్చేయండి. ఆ విద్యార్థి గిల్టీ అని, యు ఆర్ రైట్ అని నేను కన్విన్స్ అయ్యాను. అయామ్ ప్రౌడ్ ఆఫ్ యు ఇనస్పెక్టర్. గో ఎ హెడ్...

* * *

పన్నెండు గంటలయింది. ఆకాశంలో సూర్యుడు మండుతున్నాడు. పోలీస్‌స్టేషన్ లోపల ప్రభు. బయట విద్యార్థులు మండిపోతున్నారు. పోలీస్ జులుం నశించాలి. అన్యాయంగా నిర్బంధించిన విద్యార్థుల్ని విడుదల చేయాలి. ఇన్‌స్పెక్టర్ రవిరాజ్... డౌన్ డౌన్...'

ఇన్‌స్పెక్టర్ రవిరాజ్ సమాజంలో జరుగుతున్న రకరకాల అరాచకాలను చూచి వాటిని తన శక్తిమేరకు అరికట్టాలన్న ధృడ సంకల్పంతో పోలీస్ డిపార్ట్‌మెంటులో చేరినవాడు. అతనికి పొగడ్తలు పట్టవు. విమర్శల్ని లెక్క చేయడు. ధర్మం. ధర్మం రక్షించబడాలి. ధర్మాన్ని రక్షిస్తేనే ధర్మం మనల్ని రక్షిస్తుంది.

ధర్మో రక్షతి రక్షితః—

'సర్. ఆ అమ్మాయి ఎవరో ఏమిటో ఎంత శూపీ తీసినా దొరకలేదు సార్. కాలేజీ స్టూడెంట్ మాత్రం కాదు'

'కాదులే. ఆ చుట్టుపక్కల యిళ్ళలో వాకబు చేశారా!'

'చేశాం సార్. వాళ్ళకెవరికీ జరిగిన విషయమే అసలు తెలీదన్నారు.

రవిరాజ్ ఏడవలేక నవ్వుకొన్నాడు.

పోలీసుల చిత్తశుద్ధి మీద, చట్టాల సామర్థ్యం పట్ల జనానికున్న నమ్మకానికి అది నిదర్శనమా! లేక ప్రజల వుదాసీనతకు నిదర్శనమా!

అధర్మానికి గురికాబడ్డ ఆ ఆడకూతురుకు దోషిని శిక్షిద్దామన్న శ్రద్ధ లేదు. ఇక తనకెందుకు!

*

